క్లుప్తంగా

అధ్వానంగా పారిశుధ్యం



పట్టణంలోని దిబ్బలపాలెంలో పేరుకుపోయిన వ్యర్థాల వద్ద పందులు

ఏలేశ్వరం: పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. ప్రధాన రహదారులపై చెత్త, వ్యర్థాలు పేరుకు పోవడంతో పాటు డ్రైన్లలో మురుగు నిల్వ ఉండటంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక తోటవీధి, షిర్డీ నగర్, దిబ్బల పాలెం తదితర ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో పందులు, కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. డ్రైన్లలో పూడిక పేరుకపోవడంతో మురుగు నీరు ముందుకు పారడం లేదు. పలు ప్రాంతాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. వీధి దీపాలు నిరంతం వెలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మాదిగల మహా ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

తుని: హైదరాబాద్‌లో వచ్చే నెల 7న మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో వెయ్యి గొంతులు–లక్ష డప్పుల పేరుతో నిర్వహించే మాదిగల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేపూడి శ్యాం బాబు పిలుపునిచ్చారు. స్థానిక గొల్లప్రారావు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాదిగల మహా ప్రదర్శన పోస్టర్, కరపత్రాలను ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ మహాప్రదర్శనపై విస్తృత ప్రచారం నిర్వహించి విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ మహా ప్రదర్శనకు మాదిగ, రెల్లి ఉపకులాలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

బీజేపీ మండల కార్యదర్శిగా ఏసుబాబు



ఏలేశ్వరంలో ఏసుబాబుకు నియామక పత్రం అందజేస్తున్న మండల అధ్యక్షుడు సురేష్

ఏలేశ్వరం: బీజేపీ ఏలేశ్వరం మండల కార్యదర్శిగా కర్రెడ్ల ఏసుబాబు నియమితులయ్యారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు నీలి సురేష్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కురాకుల రాజా, గరికి నాగు, పలివెల మల్లేశ్వరరావు, గెడ్డం బీమయ్య, బూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

టోల్ ప్లాజా వద్ద రక్తదాన శిబిరం

కిర్లంపూడి: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద రక్తదానం శిబిరం నిర్వహించారు. ఎన్‌హెచ్ సేఫ్ వే, టీఎంఆర్ ఇన్‌ఫ్రా, ఎస్‌కే షాన్‌బూషా కంపెనీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ప్రారంభించారు. టోల్‌ప్లాజా సిబ్బంది, వినియోగదారులు కాకినాడ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి 43 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎస్సై సతీష్, సేఫ్‌వే ప్రాజెక్ట్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, సీనియర్ సేఫ్టీ మేనేజర్ అశోక్, టోల్‌ప్లాజా మేనేజర్లు జీవీ రమణ, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేయించండి


తుని రూరల్: తుని కోర్టులో నూతన భవనాలు నిర్మించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడిని తుని బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. బుధవారం తేటగుంట క్యాంపు కార్యాలయంలో యనమలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలుగు కృష్ణశేఖర్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు కలిశారు. కోర్టుకు కొత్త భవనాల అవసరాన్ని, ప్రస్తుతం ప్రైవేట్ భవనంలో ఉన్న భవనాల మార్పును యనమలకు వివరించారు. సానుకూలంగా స్పందించిన యనమల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు కేటాయింపులు చేస్తామన్నారు. అలాగే తుని పాత సంచుల వర్తక సంఘం కార్యవర్గ సభ్యులు యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు యనమల సతీష్, సాకా సత్తిబాబు, బోనం చినబాబు, మేడిద గణేష్, యాళ్ల బద్రినారాయణ, యనమల సత్యనారాయణ పాల్గొన్నారు.

నిందితులకు రిమాండ్

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో తన తాటాకిల్లును తగలు బెట్టారంటూ బాధితుడు నీలి చిన్నబ్బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు విచారణ చేశారు. ఈ మేరకు నిందితులు ములగపూడి గ్రామానికి చెందిన ఇందన బాబ్జి, పారుపాక గ్రామానికి చెందిన కల్లేపల్లి రాజుపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజర పరచామని ఎస్ఐ తెలిపారు. తుని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి నిందితులకు 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన చెప్పారు.

ఇకపై స్మార్ట్ బాదుడు

- మాన్యువల్ విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- ఇకపై రీచార్జ్ చేస్తేనే విద్యుత్ వెలుగులు
- బిల్లుల స్థానంలో ప్రీపెయిడ్ విధానం
- తొలుత ప్రభుత, వ్యాపార సంస్థల్లో ఏర్పాటు
- పేదలకు, గిరిజనులకు తప్పని కష్టాలు



ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్

ప్రత్తిపాడు: సాంకేతిక అన్ని రంగాల్లో విస్తరిస్తోంది. విద్యుత్ శాఖ మాన్యువల్ మీటర్లకు స్వస్తి చెప్పనుంది. సెల్ ఫోన్ ప్రీపెయిడ్ రీచార్జ్ మాదిరిగానే ఇకపై రీచార్జ్ చేసుకుంటేనే...ఇంట్లో విద్యుత్ వెలుగులు ఉంటాయి. మన ఖాతాలో డబ్బులు లేకపోతే వెంటనే కరెంట్ కట్ అవుతుంది. విద్యుత్ చార్జీల చెల్లింపు విధానం ప్రీపెయిడ్‌లోకి మారిపోతోంది. దీనిలో భాగంగా బ్యాలెన్స్ ఉన్నంతవరకు (రీచార్జి మొత్తం అయిపోగానే) విద్యుత్ సరఫరా అవుతుంది. ఆపై ఆటోమేటిక్‌గా నిలిచిపోతుంది. రీచార్జ్ అయిపోతే చీకట్లో మగ్గాల్సిందే.

ప్రస్తుత విధానంతోనే వినియోగదారులకు మేలు

సాధారణంగా నెలలో వినియోగించిన విద్యుత్ బిల్లు మరుసటి నెలలో చెల్లిస్తుంటారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకు ఎలాంటి అపరాధ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ నేపథ్యంలో వినియోగదారుడు బిల్లు చెల్లించడానికి నెల వరకూ సమయం ఉంటుంది. ఇంతవరకు అనుసరిస్తున్న ఈ విధానం వినియోగదారుడికి సౌకర్యంగానే ఉంది. కేంద్ర ప్రభుత్వ మార్గ దర్శకాలకు అనుగుణంగా దశల వారీగా ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను విద్యుత్ శాఖ ఏర్పాటు చేస్తోంది. ఈ మీటర్లలో ప్రీపెయిడ్ ఆప్షన్ జత చేశారు. దీని ద్వారా విద్యుత్ సరఫరా కోసం ముందుగానే రీచార్జ్ చేసుకోవాలి. ఇప్పటికే మండలంలో తొలివిడతగా ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. గత నెల రోజుల వ్యవధిలో మండలంలోని 32 ప్రభుత్వ కార్యాలయాలకు, 325 సచివాలయాలు, వీధి లైట్లకు స్మార్ట్ మీటర్లను విద్యుత్ శాఖ ఏర్పాటు చేసింది.

త్వరలో అందుబాటులోకి యాప్...

గతంలో ఉన్న మాన్యువల్ మీటర్లను చూసి, ఎంత విద్యుత్ వినియోగించామో రీడింగ్ రాసుకునేవారు. దీని ద్వారా వినియోగదారునికి బిల్లు వచ్చేది. స్మార్ట్ మీటర్లకు రీడింగ్ తీయాల్సిన అవసరం లేదు. మొబైల్ రీచార్జ్, డిష్ టీవీలకు రీచార్జ్ విధానంలోనే స్మార్ట్ మీటర్లకు రీచార్జ్ చేసుకోవాలి. ఇందుకు త్వరలోనే యాప్ అందుబాటులోకి రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎంత విద్యుత్ వినియోగించుకున్నదీ సెల్ ఫోన్‌లో బ్యాలెన్స్ ఎలా చూసుకుంటామో అదే మాదిరిగా యాప్‌లో చెక్ చేసుకోవచ్చు.

స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు

అవగాహన లేమితో రీచార్జ్ చేసుకోవడంలో వినియోగదారుడు ఏమాత్రం అలసత్వం వహించినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో బకాయిల బాధ, విద్యుత్ చౌర్యం ఉండదని అధికారులు చెబుతున్నారు. అయినా విద్యుత్ స్తంభాల లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు వినియోగదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు

కేటగిరి	వివరం	మీటర్ల సంఖ్య
1	గృహాలు	21,036
2	వ్యాపార సంస్థలు	1,854
3	రైస్ మిల్లులు, పరిశ్రమలు	61
4	ప్రభుత్వ సంస్థలు	485
5	వ్యవసాయ రంగం	1,559
	మొత్తం	24,995

రాత్రి వేళ చార్జ్ అయిపోతే..



ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒకవేళ రాత్రి సమయంలో చార్జ్ అయిపోతే ఎలా ? గ్రామీణులకు రీచార్జ్ చేయడం తెలియదు. రాత్రంతా చీకట్లో ఉండాల్సిందే. ప్రభుత్వం స్పందించి, ప్రత్యామ్నాయం చూపాలి.

– నామన భాస్కర్, ఫొటోగ్రాఫర్, ప్రత్తిపాడు

గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు



గ్రామీణ ప్రజలకు ఈ స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు తప్పవు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి రీచార్జ్ అయిపోతే అంధకారంలో ఉండాల్సిందే. రీచార్జ్ చేయాలంటే సెల్‌ఫోన్ దుకాణానికి వెళ్లాలి. అదే పట్టణంలో అలాంటి పరిస్థితులు ఉండవు.

– తటవర్తి అయ్యన్నదొర, టి.రాయవరం, ప్రత్తిపాడు మండలం

ప్రజలకు అవగాహన కల్పించాలి



గ్రామాల్లో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తే మంచిది. ఆ దిశగా విద్యుత్ శాఖ అధికారులు ముందుకు సాగాలి. స్మార్ట్ మీటర్ల వలన ఉపయోగాలనూ చెప్పాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలు ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుతో భయపడుతున్నారు.

– మానుకొండ లచ్చబాబు, పోతులూరు, ప్రత్తిపాడు మండలం

దశల వారీగా ఏర్పాటు చేస్తాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రత్తిపాడు మండలంలో దశల వారీగా అన్నీ కేటగిరి సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తాం. వీటి ద్వారా రీడింగ్ యూనిట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. నాణ్యమైన విద్యుత్ సరఫరాను వినియోగదారులు పొందవచ్చు.

– ఎ శ్రీను, అసిస్టెంట్ ఇంజినీర్, విద్యుత్ శాఖ, ప్రత్తిపాడు

ప్రజలకు అందుబాటులో ఉంటా

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం



రాచపల్లి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

ప్రత్తిపాడు రూరల్: నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి పాటుపడతానని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. మండలంలో రాచపల్లి, ధర్మవరం గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. రాచపల్లిలో పెదిరెడ్డి వీరభద్రం ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ముద్రగడ పరామర్శించి మరణానికి గల కారణాలను అడిగి తెసుకున్నారు. ధర్మవరంలో సిద్ధా జయబాబు ఇటీవల ప్రమాదంలో గాయపడ్డారు. ఆయనను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెసుసుకున్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన తన తనయుడు ముద్రగడ గిరిబాబును ప్రజలు ఆశీర్వదించి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు జువ్వల బాబులు, పార్టీ నాయకులు బెంతుకుర్తి అబ్బాయి, సారిపల్లి గంగరాజు, జల్లిగంపల ప్రభాకరరావు, జువ్వల చినబాబు, పెద్దిరెడ్డి ప్రసాద్, పెదిరెడ్డి నానిబాబు, సారిపల్లి గోవింద్, కరోతు బాబ్జి, ఒమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



తుని మండలంలో స్వచ్ఛ దివస్ పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ

తుని రూరల్: ప్రశాంతమైన ఆరోగ్యకర జీవనానికి పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని ఎంపీడీఓ కె.సాయి నవీన్ అన్నారు. స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా బుధవారం తుని మండలం జగన్నాథగిరి నుంచి లోవదేవస్థానం ఘాట్‌రోడ్డు వరకూ పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతపై ప్రజల్లో సచివాలయ సిబ్బంది చైతన్యం తీసుకురావాలన్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలన్నారు. లోవదేవస్థానం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటే ఆహ్లాదకర వాతావరణంలో భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. జగన్నాథగిరి, తాళ్లూరు, వి.కొత్తూరు, లోవకొత్తూరు గ్రామాల పరిధిలోని జాతీయ రహదారి నుంచి లోవ దేవస్థానం వరకు రహదారిని శుభ్రపరిచినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ జి.మరిడియ్య, నాలుగు పంచాయతీల కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

గండేపల్లి: కుష్ఠు వ్యాధిని నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సామాజిక కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. మండలంలోని మల్లేపల్లిలో బుధవారం నిర్వహించిన లెప్రసీ నివారణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ (ఎన్ఎల్ఈపీ) కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వచ్చి పరీక్షలు నిర్వహిస్తున్న ఆశ, వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. 2027 నాటికి కుష్ఠు రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. శరీరంపై మచ్చలు, స్పర్శ తెలియకపోవడం, చెవి పైభాగం మందంగా ఉండటం, కనురెప్పలు దగ్గరకు అంటుకోకపోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వ్యాధి సోకిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీపీఎంఓ కె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జయబాబు, ఆశ, తదితరులు పాల్గొన్నారు.

వయోజనులు విద్యావంతులు కావాలి



ఉల్లాస్ శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీపీ కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: వయోజనులంతా చదువరులు కావాలని ఎంపీపీ గొళ్ల కాంతిసుధాకర్ సూచించారు. ప్రత్తిపాడు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉల్లాస్ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కాంతి సుధాకర్ మాట్లాడుతూ వయోజన విద్య ఆవశ్యకతను వివరించారు. ఎంపీడీఓ కుమార్‌బాబు మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మండలంలో 650 మంది మహిళా నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 65 కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కేంద్రాల ద్వారా 55 రోజుల్లో అక్షరాస్యులుగా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వయోజన విద్య నోడల్ అధికారి వెంకటరెడ్డి, ఏపీఎం వై.వెంకట్, హెచ్‌డీ యాంకర్ అనిల్ కుమార్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

రామాలయంలో ఏకాహం

ప్రత్తిపాడు: స్థానిక కొత్తపేట రామాలయం వద్ద బుధవారం భక్తిశ్రద్ధలతో ఏకాహం నిర్వహించారు. అయోధ్యలో రామాలయం నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏకాహం ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన భజన భక్త బృందాలు భక్తి గీతాలను ఆలపించాయి. ఈ ఏకాహం గురువారం ఉదయం వరకు కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం

గండేపల్లి: మండలంలోని ఎన్టీ రాజాపురం, కె.గోపాలపురం, గండేపల్లి గ్రామాల్లో బుధవారం త్రైత సిద్ధాంతంపై ప్రచారం నిర్వహించినట్టు రాజమహేంద్రవరం త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు, సత్యవతి, దేవి తదితరులు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమలో శాంతి, శోభారాణి, భరత్, అన్నవరం, ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

కిర్లంపూడి: అపరాలు సాగు చేసే రైతులు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ ఎం.దైవకుమార్ సూచించారు. జగపతినగరంలో వ్యవసాయాధికారి జోకా అమృతతో కలిసి అపరాలు పండించే రైతులకు 50 శాతం రాయితీపై కలుపు, క్రిమిసంహారక మందులను పంపిణీ చేశారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఎ.సురేష్, వీపీఏ రామకృష్ణ, సునీత పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా కలెక్టర్ పర్యటన

- ఆసుపత్రి, సంపద కేంద్రాల్లో తనిఖీలు
- సిబ్బందికి పలు సూచనలు, సలహాలు



జగ్గంపేటలో పశువైద్యశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్



బూరుగుపూడిలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్

జగ్గంపేట: మండలంలోని మామిడాడ, కాండ్రేగుల, జగ్గంపేట గ్రామాల్లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ బుధవారం పర్యటించారు. మామిడాడలో గోకులం షెడ్లు, కాండ్రేగుల గ్రామంలో వీరన్న చెరువు అభివృద్ధి పనులు, జగ్గంపేటలో ప్రాంతీయ పశువైద్యశాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సాధారణ తనిఖీల్లో భాగంగా జగ్గంపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించినట్లు తెలిపారు.

జోరుగా అభివృద్ధి పనులు

జిల్లా వ్యాప్తంగా ఎన్ఆర్‌జీఎస్ నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గ్రామాల్లో అవసరం లేని చోట సిమెంట్ రోడ్లు వేస్తున్నారని విలేకర్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎక్కడైనా అలాంటి జరిగితే తనకు ఫొటోలతో వాట్సాప్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జీవీఆర్ రమేష్, ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ తాతయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో కలెక్టర్ తనిఖీలు

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని, బూరుగుపూడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ బుధవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆసుపత్రిని తనిఖీ చేసి నిర్వహణపై పెద్దాపురం డిప్యూటీ డీఎంహెచ్ఓ పి.సరితను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగుల గదులు, సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కరోనా రోగుల కోసం నిర్మించిన షెడ్డు ఇటీవల నిరుపయోగంగా ఉండడంతో వెయిటింగ్, స్టోర్ రూమ్‌లను ఏర్పాటు చేయడానికి నిధులు కేటాయించాలని వైద్య సిబ్బంది కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం బూరుగుపూడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సంపద కేంద్రంలో తయారైన ఎరువులను కొనేందుకు రైతులు ఎందుకు ఆసక్తి చూపడం లేదని అధికారులను ప్రశ్నించారు. చెత్త నుంచి సంపద కేంద్రాల్లో లభ్యమయ్యే ఎరువుల కన్నా దుకాణాల్లో దొరికే యూరియా తక్కువ ధరకే లభించడంతో రైతులు కొనేందుకు ఆసక్తి చూపడం లేదని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంపద కేంద్రాల నుంచి ఎరువులు తక్కువ ధరకే లభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జగపతినగరం పంచాయతీలో జనాభా అధారంగా ఎన్ఆర్ఈజీఎస్‌లో ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని కోరుతూ సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ, తహసీల్దార్ జె.చిరంజీవి, వైద్యులు రాంబాబునాయక్, సాయిహేమాంజలి, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, ఏపీఓ నాయుడు, పాతంశెట్టి రవి, పాతంశెట్టి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కాలువ పనుల పునఃప్రారంభానికి సర్వే



వి.కొత్తూరు వద్ద పోలవరం కాలువ లెవెల్స్ చూస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

తుని రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పునఃప్రారంభానికి కాంట్రాక్ట్ ఇంజినీరింగ్ సిబ్బంది సర్వే చేపట్టారు. కాలువకు రెండువైపులా పేరుకుపోయిన తుప్పలను ఇప్పటికే తొలగించారు. బుధవారం తుని మండలం వి.కొత్తూరు సమీపంలో పోలవరం కాలువ వద్ద ఇంజినీరింగ్ సిబ్బంది లెవెల్స్ తీసుకున్నారు. ఐదో ప్యాకేజీగా ఉన్న తుని మండలంలో 18 కిలో మీటర్లను గతంలో నాలుగో ప్యాకేజీ విలీనం చేశారు. కాలువ పనులు మొదట షబీర్ డ్యాం, ఆ తర్వాత పీఎస్‌కే సంస్థలు 60 శాతం వరకు పనులు పూర్తి చేశాయి. ఇటీవల కాంట్రాక్టర్‌ను మార్చడంతో ప్రస్తుత పనులు మూడో కాంట్రాక్టర్ చేపట్టారు. కాలువ పనులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకోవడానికి ఇటీవల ఎస్ఈ యేసుబాబు కాలువ వెంబడి పర్యటించారు. సర్వే పనులు పూర్తయిన తర్వాత నిర్మాణాలను చేపట్టనున్నట్టు తెలుస్తుంది.

వృత్తి నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలి

గండేపల్లి: ఆధునిక శాస్త్ర, సాంకేతిక విజ్ఞానానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని ఆదిత్య విశ్వవిద్యాలయ సహాయ ఉప సంచాలకులు ఎం.శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల్లో హైదరాబాద్‌కు చెందిన ఆర్టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల విద్యార్థులకు ఎంబెడెడ్ సిస్టంపై బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను అనుభవంలోకి మలుచుకున్నప్పుడే దీనికి సార్థకత చేకూరుతుందన్నారు. ఆర్టెక్ ప్రోగ్రాం మేనేజర్ చరణదత్ మారం, జెడ్ఎఫ్ కంపెనీ ప్రతినిధి ఎస్ఎల్‌వీ శ్రవణ్ కుమార్‌లు సాంకేతిక మార్పులకు అనుగుణంగా యాంత్రిక అభివృద్ధి, మార్పులు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. నాలుగో సంవత్సరం బిటెక్ విద్యార్థులు 107 మందికి ప్రాజెక్టు నిమిత్తం ఆదిత్య ఆర్టెక్ కో ఆర్డినేటర్ ఎల్ఎస్ఎస్ సాయికిరణ్ వివిధ రకాల కాంపోనెంట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆదిత్య విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎంబీ శ్రీనివాస్, వైస్ చాన్సలర్ అకాడమిక్స్ రమాశ్రీ, రిజిస్ట్రార్ సురేష్, ఆర్టెక్ కో ఆర్డినేటర్లు టి.రవీంద్ర, దుర్గాప్రసాద్, భూపారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

1800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

రౌతులపూడి: మండలంలో శృంగవరంలో సారా స్థావరాలపై తుని ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడుల్లో సారా తయారీ కోసం నిల్వ చేసిన 1800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తుని ఎక్సైజ్ ఎస్.ఐ శాస్త్రి తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారీ, అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రేయర్లతో మెరుగైన ఫలితాలు



అపరాల పంటలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: వ్యవసాయంలో డ్రోన్ స్ప్రేయర్ల వినియోగంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని అల్లిపూడిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రీకరణ శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. దీనిలో భాగంగానే డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుమందుల పిచికారీని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అపరాల పంటలను పరిశీలించారు. పంటకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణపై రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు కేవీ శివకుమారి, నల్లమిల్లి సురేష్, ఏఈఓ రేణుక తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు వేగవంతం చేయాలి

శంఖవరం: పంట నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయాధికారి పి.గాంధీ సిబ్బందికి సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సహాయకులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రబీలో సాగు చేస్తున్న వరి, అపరాల పంటల వివరాలు నమోదు చేయాలని సూచించారు. పంట కోత ప్రయోగాలు, పీఎం కిసాన్, జాతీయ ఆహార భద్రతా మిషన్, పంటల బీమా తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు



తునిలో యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై విజయ్‌బాబు

తుని: యువత మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని తుని పట్టణ ఎస్సై జె.విజయ్‌బాబు సూచించారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో బుధవారం సాయంత్రం సీఐ గీతారామకృష్ణ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదివి ఉన్నతమైన ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉల్లాస్ వలంటీర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శివరామకృష్ణయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణా తరగతులకు మండలంలోని ఉల్లాస్ వలంటీర్లతో పాటు వెలుగు వీవీఏలు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

సమతుల్య ఆహారంతో మెరుగైన ఆరోగ్యం

తుని: ప్రతిరోజూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. స్థానిక కొత్తపేటలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్య నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ నిహారిక, సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

కోటనందూరు: మండలంలోని బొద్దవరంలో విశ్వమానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ వైద్యుడు సత్యనారాయణ 85 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోగులకు అవగాహన కల్పించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి ప్రతినిధులు సేవలందించారు.